క్లుప్తంగా

సీపీఎం నుంచి బహిష్కరణ

ఖలీల్ వాడి: సీపీఎం జిల్లా కమిటీ నాయకురాలు, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సబ్బాని లతను పార్టీ నుంచి బహిష్కరించినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ఆదివారం తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలోకి వెళ్లి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందున బహిష్కరించినట్లు వెల్లడించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



ఖలీల్‌వాడి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్ రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం రాజీవ్‌గాంధీ ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ స్ఫూర్తిని యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశంలో ఐటీ విప్లవానికి రాజీవ్ గాంధీ బీజం వేశారని గుర్తు చేశారు.

జగిత్యాల ఎమ్మెల్యేకు సన్మానం



నిజామాబాద్ సిటీ: నగరంలో ఓ ప్రయివేట్ కార్యక్రమానికి వచ్చిన జగిత్యాల్ ఎమ్మెల్యే సంజీవ్ కుమార్‌ను నిజామాబాద్ రోటరీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ చేస్తున్న కృత్రిమ కాలు(జైపూర్ ఫుట్) గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు సతీష్ సాహు, సభ్యులు విజయరావు, బాబూరావు, మంచాల కృష్ణ, జ్ఞాన ప్రకాష్, శ్యామ్ అగర్వాల్, రాజ్ కుమార్ సుబేదార్, ధన్‌పాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సిరికొండ: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారానికి సమ్మె 28వ రోజుకు చేరింది. మహిళా సంఘాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న మా పట్ల ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మూన్ సింగ్, స్వామి, లలిత, కవిత, రామ్ చందర్, వర్ణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని అంబేడ్కర్‌కాలనీలో ఉన్న పద్మశాలి సంఘం 24వ తర్ప నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గెంట్యాల వెంకటేష్, కార్యదర్శిగా బూస రవి, గౌరవ అధ్యక్షుడిగా భూమయ్య, ఉపాధ్యక్షులుగా సిద్ది రాములు, రాజేందర్, సహాయ కార్యదర్శులుగా ప్రకాష్, బాలు, కోశాధికారిగా నరేందర్, సభ్యులు గంగాధర్, నర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

సర్వర్‌లో సమస్య.. రైతులకు ఇక్కట్లు

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంతోపాటు మంగళ్‌పాడ్, కుర్నాపల్లి, వడ్డేపల్లి, ఠాణాకాలాన్ సబ్‌సెంటర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు వరిధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు అమ్మకాలు చేశారు. అమ్మిన రైతులు సొసైటీలో ఓపీఎంఎస్(ఆన్‌లైన్ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్)లో వివరాలను నమోదు చేయడానికి వెళితే ఐదు రోజులుగా సర్వర్‌లో సమస్యతో రైతులు సొసైటీల చుట్టూ ప్రదక్షిణ లు చేస్తున్నారు. ఓపీఎంఎస్ ద్వారా రోజుకు 20 మంది రైతులకు వివరాలు నమోదు చేస్తే రైతులకు ఓటీపీ వస్తుంది. ఓపీఎంఎస్‌లో సొసైటీకి సంబంధించిన సిబ్బంది ఓటీపీ వివరాలు నమోదు చేస్తే రైతులకు 3 రోజులలో డబ్బులు రైతుల ఖాతాలో జమవుతాయి. వడగండ్ల వానతో రైతులు ఇబ్బందులు పడగా ఇప్పుడు ఓపీఎంఎస్ సర్వర్ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ



ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి ఎస్‌బీఐకు వెళ్లే దారిలో రోడ్డుపై చెత్త తింటున్న పశువులు



గాజుల పేట్‌లో..

- జోన్-3లో రోడ్డుపైనే చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని జోన్-3 పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇంటింటికి చెత్త తీసుకెళ్లే వాహనాలు సక్రమంగా రాకపోవడంతోనే ఈ ప్రాంతంలోని ప్రజలందరూ రోడ్డుపైనే ముఖ్యమైన కూడళ్లలో చెత్తచెదారం వేస్తున్నారు. ఈ చెత్తే పశువులకు ఆహారంగా మారుతోంది. శని, ఆదివారాల్లో కూడా చెత్త సేకరణ అంతంత మాత్రంగానే జరుగుతున్నా పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. నగరంలోని జోన్-3 పరిధిలో 12 డివిజన్‌లు ఉన్నాయి. ఒక్కో డివిజన్ పరిధిలో 4 నుంచి 5 కాలనీలు ఉన్నాయి. ముఖ్యంగా గాజులపేట్, ఐటీఐ ప్రాంతంలో, శివాజీచౌక్, ఆర్‌ఆర్‌చౌరస్తా నుంచి వర్నిరోడ్ చౌరస్తా వరకు, ఖిల్లా చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. ప్రతినిత్యం తడి, పొడి చెత్త సేకరణకు రావాల్సిన ఆటోలు రావడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. చెత్త వాహనాలు సక్రమంగా రాకపోవడంతోనే చెత్తాచెదారం రోడ్డుపై వేస్తున్నారు. కుక్కల బెడద కూడా ఉంది. అలాగే మురుగు కాలువల్లో సైతం మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చెత్త సేకరణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరుతున్నారు.



జోన్-3 కార్యాలయం నుంచి గాజులపేట్‌కు వెళ్లే రహదారిలో

కల్లాలకే పరిమితమైన ధాన్యం



తొర్తిలో కల్లంలోనే ధాన్యం బస్తాలు ..



సంచులు లేకపోవడంతో కుప్పలుగా ఉన్న ధాన్యపు రాశులు

- ఏర్గట్ల మండలం తొర్తిలో 15 రోజులుగా నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు
- హమాలీలు లేకపోవడమే కారణం
- ఆందోళన చెందుతున్న రైతులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయలేక సహకార సంఘం ఉద్యోగులు చేతులెత్తేశారు. హమాలీ కార్మికులు లేకపోవడంతో 15 రోజుల నుంచి గ్రామంలో ధాన్యం తూకం వేయడం నిలిచిపోయింది. కల్లాల్లోనే ధాన్యం నిలువలు ఉండిపోయాయి. గ్రామం నలుమూలలా ధాన్యం రాశులు ఎక్కడికక్కడ ఉండిపోవడం కొనుగోళ్లకు స్పందన కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తొర్తి, ఏర్గట్ల మండలంలో ఉన్నా సహకార సంఘం మాత్రం మోర్తాడ్ మండలంలోని శెట్‌పల్లి పరిధిలో కొనసాగుతోంది. శెట్‌పల్లి సహకార సంఘం ఉద్యోగులే ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాల్సి ఉంది. గడిచిన నెల చివరి వారం నుంచి ఈ నెల మొదటి వారం వరకు అకాల వర్షాల వల్ల కొనుగోళ్లకు బ్రేక్ పడింది. ఆ తరువాత హమాలీ కార్మికులు లేకపోవడంతో కొనుగోళ్లు పూర్తిగా నిలచిపోయాయి. యాసంగి సీజనుకు గాను తొర్తిలో దాదాపు 1,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. అందరు రైతులు దొడ్డు రకాలనే సాగు చేయడంతో ఈ రకం ధాన్యంను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించనున్నారు. శెట్‌పల్లి సహకార సంఘం పరిధిలో వరి ఎక్కువగా సాగు చేసిన గ్రామం కూడా తొర్తి కావడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

సమాచారం..

నేడు జీలుగ విత్తనాల పంపిణీ

డిచ్‌పల్లి: మండలంలోని నాలుగు సొసైటీల ఆధ్వర్యంలో సోమవారం జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి(ఏవో) రాంబాబు ఆదివారం తెలిపారు. డిచ్‌పల్లి, మెంట్రాజ్‌పల్లి, రాంపూర్, బర్ధిపూర్ సొసైటీల్లో మొత్తం 700 క్వింటాళ్ల(2,333 బస్తాలు) జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తారని తెలిపారు. రైతులు పట్టాపాసు బుక్ జిరాక్స్ సొసైటీ వద్ద ఇచ్చి, వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ పర్మిట్ పొంది జీలుగ విత్తనాలు పొందాల్సి ఉంటుందన్నారు. 30 కేజీల బస్తాకు సబ్సిడీ పోగా రూ.842.70 ధర చెల్లించాల్సి ఉంటుందని ఏవో రాంబాబు తెలిపారు.

సిరికొండ పరిధిలో..

సిరికొండ: సిరికొండ, తూంపల్లి సొసైటీల ద్వారా రైతులకు జీలుగ విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్ తెలిపారు. 30 కేజీల బస్తాకు రూ.842.70 వసూలు చేస్తున్నట్లు వివరించారు.

బైపాస్ రోడ్డు వేయొద్దు



కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- ఇది వరకే వివిధ రకాలుగా భూములు కోల్పోయామని రైతుల ఆవేదన
- ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారినే నాలుగు లేన్లుగా మార్చాలి
- కమ్మర్‌పల్లిలోని 63వ నంబర్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన

కమ్మర్‌పల్లి: 63వ నంబర్ జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ కోసం బైపాస్ మార్గం వద్దని, ప్రస్తుతం ఉన్న రహదారినే నాలుగు లేన్లుగా విస్తరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మండల కేంద్రం పరిధిలో ఇదివరకే ఎస్సారెస్పీ వరద కాలువ, రైల్వే లైన్, హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం కాలువలు, పసుపు పరిశోధన స్థానం, మండల అధికార కార్యాలయాల కోసం వందలాది ఎకరాల తమ విలువైన భూములను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి వెడల్పు కోసం బైపాస్(గ్రీన్ హైవే) ద్వారా రోడ్డు నిర్మాణం చేపడితే మళ్లీ వందలాది ఎకరాల విలువైన పంట భూములను కోల్పోతామని ఆక్షేపించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) రూపొందించిన అలైన్‌మెంట్‌ను(గ్రామం నుంచి వెళ్లే మార్గం) గ్రామంలోని బడా వ్యాపారులు వ్యతిరేకిస్తూ, బైపాస్ రోడ్డు(గ్రీన్ హై వే) నిర్మాణాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ రాస్తారోకోతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై రాజశేఖర్ రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, రైతులు వేముల గంగారాం, కొమ్ముల రాజగంగారాం, సుంకెట రాజమల్లు, వేముల శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

- బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల కబ్జా
- సర్వే నంబరు-1333లో హద్దుల ఏర్పాటును అడ్డుకున్న రియల్టర్లు

బాల్కొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను కాపాడండి మహ ప్రభో అంటూ వీడీసీ సభ్యులు ఆర్డీవో కార్యాలయానికి తరలి వెళ్లారు. అంటే బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల కబ్జా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలోని సర్వే నంబరు-1333లో ప్రభుత్వ భూమి ఉంది. గతంలో పలు మార్లు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తించారు. కాని హద్దులు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. తాజాగా హద్దులు ఏర్పాటు చేయటానికి అధికారులు చర్యలు చేపట్టారు. కానీ హద్దుల ఏర్పాటును స్థానిక రియల్టర్లు అడ్డుకున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో మండల కేంద్రంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో జాగా కనిపిస్తేనే పాగా వేస్తున్నారు. సర్వే నంబరు- 1333 భూమి జాతీయ రహదారి-44 పక్కన ఉంది. దీంతో గుంట స్థలం కబ్జా చేసినా లక్షల్లో దండు కోవచ్చని కొందరు పెద్దలు వేసిన పన్నాగంలో సామాన్యులు బలి అవుతున్నారు. పేదలకు స్థలం అని చూపుతు పెద్దలు పండగ చేసుకుంటున్నారు. కాసులు ఇస్తే ఒకటే స్థలాన్ని ఎంత మందికైనా అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేదంలూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద బాల్కొండ వీడీసీ సభ్యులు (ఫైల్)

ఆర్డీవో కార్యాలయానికి తరలి వెళ్లిన వీడీసీ సభ్యులు

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు వెంటనే సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో కార్యాలయం ఆర్మూర్‌కు వీడీసీ సభ్యులు 4 రోజుల క్రితం తరలి వెళ్లారు. ప్రభుత్వ భూముల్లో సర్వే నిర్వహించి వెంటనే సరిహద్దులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ భూమికి రక్షణగా ఉంటుందని విన్నవించారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ప్లాట్లు ఉన్నాయని అడ్డుకున్నారు

సర్వే నంబర్-1333లో ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయటానికి వెళితే కొందరు ప్లాట్లు ఉన్నాయని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమస్యను విన్నవించాం. రక్షణ కల్పిస్తే హద్దులు ఏర్పాటు చేయటానికి సిద్ధంగా ఉన్నాం.

–రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

'కోర్టు తీర్పును ధిక్కరించి కూల దోస్తున్నారు'

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనుల్లో తన ఇంటిని కోర్టు తీర్పును కాదని వీడీసీ వారు కూల దోస్తున్నారని గ్రామానికి చెందిన చింత భరత్ భూషణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఉపాధినిచ్చే ఇంటిని కూల్చవద్దని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ వీడీసీ సభ్యులు పట్టు బట్టి తన నివాసాన్ని పాక్షికంగా కూలదోశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కుమ్మన్‌పల్లిలో టీఎస్ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ పర్యటన




మాట్లాడుతున్న డైరెక్టర్ సంధ్యా రాణి

బోధన్ రూరల్ (బోధన్): కుమ్మన్ పల్లి, కొప్పర్తి క్యాంప్ గ్రామాల్లో టీఎస్ ఎన్పీడీసీఎల్(వరంగల్) డైరెక్టర్ సంధ్యా రాణి ఆదివారం పర్యటించారు. గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే పనులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, బోధన్ డీఈ ముక్తార్, ఏడీఈ బెనర్జీ, ఏఈ కల్యాణ్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్తా'

- బార్ అండ్ రెస్టారెంట్ యజమాని జయసింహా రెడ్డి



పర్మిషన్, హైకోర్టు ఉత్తర్వులను చూపెడుతున్న జయసింహారెడ్డి

ఖలీల్‌వాడి: హ్యాపీనెస్ బార్ అండ్ రెస్టారెంట్ అన్ని అనుమతులు తీసుకున్నా సెట్‌బ్యాక్ లేదని మున్సిపల్ అధికారులు తాళం వేయడంతో తాను నష్టపోయాయని, నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్తానని రెస్టారెంట్ యజమాని జయసింహారెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న సెట్‌బ్యాక్ లేదని మున్సిపల్ అధికారులు వచ్చి సీజ్ చేశారని తెలిపారు. దుబ్బలో రెండు ఎకరాల స్థలంలో 600 గజాలకు రూ.10.40 లక్షలు కట్టి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. అనుమతులు తీసుకున్న తర్వాత ఎక్సైజ్ అధికారులు అన్ని అనుమతులను పరిశీలించిన తర్వాత బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. మున్సిపల్ సిబ్బంది కక్షగట్టి సీజ్ చేయడమే కాకుండా కరెంట్ సరఫరా నిలిపివేయడంతో మద్యం అమ్మకాల్లో నష్టపోయినట్లు తెలిపారు. బార్‌ను సీజ్ చేయడంతో కస్టమర్లు రావడం లేదని, దీనితో ఆర్థికంగా నష్టపోయినట్లు చెప్పారు. సీజ్ చేయడంపై హైకోర్టు ఆశ్రయించగా.. బార్ అండ్ రెస్టారెంట్ నడుపుకోవడానికి అనుమతి ఇచ్చిందన్నారు. 12 రోజులు సీజ్ చేయడంతో నష్టపోయానని, ఈ విషయంలో నష్టపరిహారం కోసం కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

ఘనంగా పోచమ్మ పండుగ సంబరాలు



దుబ్బాకలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మున్నూరు కాపు కులస్తులు

ధర్పల్లి: దుబ్బాక గ్రామంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇంటికి ఒక బోనం చొప్పున మంగళ హారతులతో ఊరేగింపుగా బయలుదేరి పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు మంచిగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా హోర్డింగ్



పులాంగ్ కూడలి వద్ద వంగి ఉన్న హోర్డింగ్



హోర్డింగ్ వద్ద ఉన్న మురికికాలువ రాళ్లు పడిపోవడంతో వంగుతున్న ఇనుపరాడ్లు

ఖలీల్‌వాడి: నగరంలోని పులాంగ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్ వంగిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ హోర్డింగ్ బేస్‌మెంట్ పూర్తిగా దెబ్బతిన్నది. ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నందున మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం

బోధన్: టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 23న హైదరాబాద్‌లో జరుగనుందని ఆ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి విద్యాసాగర్ ఆదివారం తెలిపారు. టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ల నాయకత్వంలో సమావేశం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చ ఉంటుందని తెలిపారు. లింగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,700	వెండి (కిలో)	77,000
22 క్యారెట్స్	57,812		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	30	50
బెండకాయ	20	40	గాజరుగడ్డ	25	40
బీరకాయ	35	50	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	70	90	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	50	70	గోబిపువ్వు	20	40
పాలకూర	40	60	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	40	60	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్-1- కేరళ స్టోరీ(తెలుగు)-10.40,10.35
బిచ్చగాడు-2-1.25,7.40
అన్నీ మంచి శకునములే-4.30
స్క్రీన్-2- ఫాస్ట్ ఎక్స్-తెలుగు-3డీ-10.50
కస్టడీ -1.35,10.35
సింహాద్రి-4.30
అన్నీ మంచి శకునములే-7.40
స్క్రీన్-3 - కేరళ స్టోరీ(తెలుగు)-1.30
ఫాస్ట్ ఎక్స్(తెలుగు)3డీ-4.20,7.40,10.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1- ఫాస్ట్ ఎక్స్(ఇంగ్లీష్) 3డీ -10.30
1.30,4.30,7.30,10.30
స్క్రీన్-2- ఫాస్ట్ఎక్స్(తెలుగు)-9.30,
12.30,6.45
3డీ-గార్డియన్స్ ఆఫ్(ఇంగ్లీష్) -3.30
ది కేరళ స్టోరీ(హిందీ)-9.45
స్క్రీన్-3- ది కేరళ స్టోరీ(తెలుగు)- 10.00,7.10
ది కేరళ స్టోరీ(హిందీ)-1.00
బిచ్చగాడు-2 -4.00,10.15
స్క్రీన్-4- కస్టడీ -12.25,6.50
అన్నీ మంచి శకునములే -3.35, 10.00
దేవి బిచ్చగాడు-2
నటరాజ్ ఫాస్ట్ ఎక్స్(తెలుగు)
లలితామహల్ సింహాద్రి
విజయ్ విరూపాక్ష